
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★ మంగళవారం 13 ఆగస్టు 2024

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఏసీపీ రమేష్ 8

గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి.. 8

ఎన్‌పీడీసీఎల్ 'పొలం బాట'



- అక్కడికక్కడే రైతుల సమస్యల పరిష్కారం
- ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహణ
- విద్యుత్ కార్యాలయాల్లో కన్స్యూమర్ డెస్కులు
- వినియోగదారులు, రైతులకు చేరువైన సేవలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వినియోగదారులకు సత్వర సేవలు అందిస్తున్న ఎన్‌పీడీసీఎల్ తాజాగా రైతుల సమస్యలను తీర్చేందుకు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల 7వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టారు. పొలాల వద్దకు వెళ్లి కరెంట్ సమస్యలను తెలుసుకుని, విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు గాను పలు సూచనలు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ (ఎన్‌పీడీసీఎల్)లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో జవాబుదారీ తనాన్ని పెంచేందుకు గత కొన్ని రోజులుగా ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, ఫీడర్ల వైఫల్యాలు, అంతరాయాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని విద్యుత్ సరఫరాను మెరుగుపర్చడం, సంస్థాపరంగా వినియోగదారులకు అందాల్సిన సేవలు అందుతున్నాయా, లేదా, సంస్థ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకునేందుకు వీలుగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే అన్ని కార్యాలయాల్లో కన్స్యూమర్ డెస్కులను ఏర్పాటుచేయగా, తాజాగా పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సెక్షన్, సబ్‌డివిజన్, డివిజన్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎస్‌ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహించి వినియోగదారుల నుంచి వచ్చే దరఖాస్తులను ఎన్‌పీడీసీఎల పోర్టల్‌లో నమోదును చేసి పరిష్కరిస్తున్నారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా కూడా వేగంగా పనులు జరిగేవి కావు. ప్రస్తుతం సమస్యల పరిష్కారంలో వేగం పెరిగింది. ప్రజావాణి కార్యక్రమమే గాకుండా సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్, ఎస్‌ఈ కార్యాలయాల్లో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్కులను ఏర్పాటు చేశారు. వీటిలో ఏఈలు, సబ్ ఇంజినీర్లు అందుబాటులో ఉండి వినియోగదారులు ఇచ్చే దరఖాస్తులకు రశీదులు అందించి తమ పరిధిలోని అంశం అయితే అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారు. తాజాగా రైతుల సమస్యల పరిష్కారం కోసం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని 15రోజుల పాటు నిర్వహించనున్నారు. అవసరమైతే మరిన్ని రోజులు పొడిగించనున్నారు. పొలాల వద్దకు ఏఈలు, సబ్‌ఇంజినీర్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు వెళుతున్నారు. విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు వివరించడంతో పాటు మోటార్ల వద్ద ఎర్తింగ్ సరిగా ఉందా, లేదా చూడడంతో పాటు అతుకులు లేని సర్వీస్ వైర్ ఏర్పాటు చేసుకోవాలని, మోటార్లపై ఇనుప డబ్బాలను వాడకుండా ప్లాస్టిక్‌వి వాడాలని చెబుతున్నారు. అలాగే పొలాల వద్ద రైతుల చేతులు తడిగా ఉంటాయని మోటార్ ఆన్ చేసేటప్పుడు నేరుగా ఆన్ చేయకుండా ఒక కర్ర పుల్ల సాయం తీసుకోవాలని ప్లాస్టిక్ పరికరంతో ఆన్ చేయాలని చెబుతున్నారు. ఐఎస్ఐ మార్కుగల తక్కువ రాపిడి ఇచ్చే పైపులు, బ్రాండెడ్ పుట్‌వాల్వులు వాడాలని సూచిస్తున్నారు. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లపై ఎంత లోడ్ ఉందో కూడా పరిశీలిస్తున్నారు. పొలం బాటలో బాగా ఎక్కడైనా దొంగ కనెక్షన్లు కనబడితే వాటిని తొలగిస్తున్నారు. మొత్తంమీద వినియోగదారులు, రైతులకు విద్యుత్‌పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఎన్‌పీడీసీఎల్ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలతో కొంత మేరకు సత్ఫలితాలు వస్తుండడంతో ఊరట చెందుతున్నారు.



పాలకుర్తి మండలంలో రైతులతో విద్యుత్ అధికారులు(ఫైల్)

ఓటర్ల జాబితాలను పకడ్బందీగా రూపొందించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముసాయిదా ఓటర్‌జాబితా గ్రామాలవారీగా రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ఓటర్ జాబితా ప్రకారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ జాబితా సవరణకు చర్యలు తీసుకోవాలని, 18 సంవత్సరాల నిండిన అర్హులైన నూతన ఓటర్లను నమోదు చేయాలన్నారు. అదేసమయంలో మరణించిన వారి ఓటు వివరాలు తొలగించాలని,గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ముసాయిదా ఓటర్ జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల లక్ష్యం పూర్తి చేయాలని, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

పాలకుర్తి, ఆగస్టు 12: మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సోమవారం మంథని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి సత్యానారాయణ సందర్శించారు. అక్కడి విద్యార్థులకు కార్పేట్లు, దుప్పట్లు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యుల నిరసన


ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12: కోల్‌కత్తాలోని ఓ ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బోధన సిబ్బంది, వైద్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజు మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు వైద్యులపై వివిధ సంఘటనలు జరుగుతున్నాయని, కోల్‌కత్తాలోని ఓ ఆసుపత్రిలో విధులు ముగించుకుని రెస్ట్ రూమ్‌కు వెళ్లిన వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. వైద్యుల రక్షణ కోసం దేశ వ్యాప్తంగా చట్టాలను తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో కూడా ఓ హౌస్ సర్జన్‌ను చావు అంచుల వరకు తీసుకెళ్లారని, వైద్యులపై రోజురోజుకు దాడులు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకువచ్చి వైద్యులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అరుణ, శిరీష, రవివర్మ, ఫరీద్, అజయ్, ఉదయ్, లక్ష్మి, ప్రియాంక, ప్రశంస పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ఇసుక మేటలు..!

- అధ్వాన స్థితిలో సర్వీస్ రోడ్లు - ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు - పట్టించుకోని నిర్వహణ సంస్థ, అధికారులు


రాజీవ్ రహదారిపై పేరుకుపోయిన మట్టి


సర్వీస్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12: రాజీవ్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనదారులకు మెరుగైన సేవలందించాల్సిన రోడ్డు నిర్వహణ సంస్థ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. వాహనదారుల నుంచి ముక్కు పిండి టోల్ వసూలు చేస్తున్నా ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. దీనిపై పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు ఆందోళనలు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాజీవ్ రహదారిపై బసంత్‌నగర్ నుంచి మంచిర్యాల జిల్లా ఇందారం క్రాస్‌రోడ్డు వరకు ఇసుక మేటలు వేయడం, సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారినా తమకేమి సంబంధం లేనట్టు రోడ్డు నిర్వహణ సంస్థ హెచ్‌కేఆర్ వ్యవహరిస్తోంది. సంస్థ తీరుపై పలు సంఘాలు ఆందోళనలు చేసినాప్పటికీ ఫలితం కనిపించడం లేదు. బీపవర్‌హౌస్ నుంచి అధ్వానంగా సర్వీస్ రోడ్లు మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఇసుక మేటలు వేయడం వల్ల రాత్రివేళ్లల్లో కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి ప్రాణాలు కోల్పోవడమే లేక శాశ్వత వికలాంగులుగానో మారుతున్నారు. బసంత్‌నగర్ నుంచి ఇందారం క్రాస్‌రోడ్డు వరకు నిత్యం రోడ్లను శుభ్రం చేయాల్సి ఉండగా నిర్వహణ సంస్థ పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డు మీద ఇసుక దిబ్బలు కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రామగుండం కమిషరేట్ ఎదుట చెట్ల నుంచి రాలిపడిన ఆకులతో రోడ్డు మొత్తం అధ్వానంగా మారింది. గోదావరిఖని బస్టాండ్ నుంచి వచ్చే సర్వీస్ రోడ్డు గుంతలమయమై జీఎం కాలనీ, బాపూజీనగర్ ప్రధానచౌరస్తా వచ్చే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఇటీవల సీపీఐ నిరసన కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. రోడ్ల నిర్వహణ హెచ్‌కేఆర్ సంస్థ చేయాల్సి ఉండగా వాటిని కార్పొరేషన్ సిబ్బంది చేత పనులు చేయిస్తున్నారు. దీనిపై గతంలో దుమారం కూడా లేచింది. హెచ్‌కేఆర్ సంస్థ టెండర్ తీసుకున్నప్పుడు టెండర్‌లో రోడ్లను శుభ్రం చేయడం, రోడ్డు మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. వాహనదారుల నుంచి మాత్రం డబ్బులను వసూలు చేస్తున్న సంస్థ రోడ్ల నిర్వహణ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ సిబ్బంది చేత పనులు..

రాజీవ్ రహదారి నిర్వహణ హెచ్‌కేఆర్ సంస్థ చేయాల్సి ఉండగా దానికి విరుద్ధంగా అదనంగా లేబర్లను పెట్టి బీ పవర్‌హౌస్ నుంచి పవర్‌హౌస్‌కాలనీ వరకు కార్పొరేషన్ పని చేయిస్తోంది. రహదారికి ఇరువైపులా పూల మొక్కలు, గ్రీనరీని పెంచాల్సి ఉండగా అవేమి చేయడం లేదు. బీ పవర్‌హౌస్ వద్ద కూడా ఏర్పాటుచేసిన సర్కిల్‌లో పిచ్చి మొక్కలు మొలిచాయి. దీనిపై గతంలో నిర్వహణ సంస్థ అధికారులను పిలిచి పనులు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మందలించినా వారిలో చలనం రావడం లేదు. రోడ్ల నిర్వహణ పనులు చేపట్టాలని కొద్దిరోజులుగా మున్సిపల్ అధికారులు సూచించినప్పటికీ సంస్థ పెడచెవిన పెడుతోంది. బస్టాండ్ వద్ద ఉన్న సర్వీస్ పూర్తిగా గుంతలమయమై కనిపించకపోవడంతో వారం రోజుల క్రితం ముగ్గురు వాహనదారులు కిందపడి కాళ్లు చేతులు విరిగాయి. మున్సిపల్ టీజంక్షన్ వద్ద ఇసుక దిబ్బలు కుప్పలుగా ఉండడంతో రాత్రి వేళల్లో వాహనదారులకు అవి కనిపించకపోవడంతో కిందపడి గాయాలపాలయ్యారు. కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లే మూలములుపు నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు చెత్తతో నిండిపోయి రోడ్డు పక్కన చెట్లు ఏపుగా పెరిగి కిందకు వంగడంతో రాత్రి పూట కనపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూడు రోజుల క్రితం ఎన్‌టీపీసీ నుంచి గోదావరిఖనికి వస్తున్న వాహనదారున్ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇప్పటికైనా సర్వీస్ రోడ్లు మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.



సర్వీస్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు(ఫైల్)

రోడ్ల నిర్వహణ గాలికి వదిలేశారు..

- కనకకరాజు, సీపీఐ నగర కార్యదర్శి



వాహనదారుల నుంచి టోల్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న హెచ్‌కేఆర్ నిర్వహణను గాలికి వదిలేసింది. సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకోవడం లేదు. పనులు మాత్రం కార్పొరేషన్ చక్క బెడుతోంది. కార్పొరేషన్ అధికారులు రోడ్లను ఊడ్చాల్సిన పని ఏముంది. అధ్వానంగా మారిన సర్వీస్ రోడ్లను నిర్మాణం చేపట్టకపోతే టోల్‌గేట్ ముందు ఆందోళన చేస్తాం.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు..

- సునీల్, బీజేపీ నాయకుడు



రాజీవ్ రహదారిపై ఇసుక దిబ్బలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్‌కేఆర్ సంస్థ మాత్రం పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలను తీస్తున్నారు. సర్వీస్‌రోడ్లు ఇసుక దిబ్బలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాల్సి ఉండా నిర్వహణ చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల లో అత్యధికంగా ప్రసవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను వినియోగించుకుని గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తిచేయాలని, ప్రతి గర్భిణీ తప్పని సరిగా 3 సార్లు ఏఎన్‌సి చెక్ అప్ చేసుకొని అవసరమైన టీకాలు వేయించుకునేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం, మంథనిలోని ఎంసీహెచ్, గోదావరిఖనిలోని జనరల్ ఆసుపత్రిలో అత్యధిక ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. గర్భిణులు ఆసుపత్రులలో అనవసరంగా డబ్బులు ఖర్చు చేయవద్దని, ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దపల్లి, గోదావరిఖని ఆసుపత్రులో టిఫా స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన గర్భిణులు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణి శ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌లతో కలిసి పాల్గొన్నారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన వి.తిరుపతమ్మ తన భర్త 10 ఫిబ్రవరి 2022 మరణించారని, వితంతువు పెన్షన్ మంజూరుచేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

బాలికపై అత్యాచారయత్నం కేసులో
నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

జగిత్యాలరూరల్, ఆగస్టు 12: ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చెందిన బాలికను నిందితుడు సాయిని గంగన్న (26)అనే వ్యక్తి అత్యాచారయత్నం చేసిన ఘటనలో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ఆధారా లు సమర్పించారు. సాక్షులను విచారించిన జగిత్యాల న్యాయమూర్తి నీలిమ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించు కోలేరన్నారు. నిందితుడికి జైలుశిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ మల్లికార్జున్, ఎస్సై శ్రీకాంత్, సీఎంఎస్ ఎస్‌ఐ రాజునాయక్, కోర్టు కానిస్టేబుల్స్ కిరణ్, రాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.

కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేస్తే నగదు మాయం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 12: జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పంజాల తిరుపతి అనే వ్యక్తి తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా కొంత నగదును పంపాడు. నగదు ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో గూగుల్‌లో సెర్చ్ చేసి ఆంధ్రాబ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేశాడు. వారు అడిగిన వివరాలన్నీ చెప్పాడు. అప్పటి నుంచి విడతల వారీగా 1,40,999 రూపాయలు బ్యాంకు ఖాతా నుంచి మాయమయ్యాయి. వెంటనే తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

కారును ఢీ కొన్న డీజిల్ ట్యాంకర్

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని కొత్తగట్టు శివారులో కరీంనగర్- వరంగల్ రహదారిపై సోమవారం కారును డీజిల్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీ కొట్టిం ది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ను వెనక నుంచి వస్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతిన్నది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న కేశవపట్నం బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 12: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,580 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీ కి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 430 క్యూ సెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.890 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రాజె క్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గడం తో ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.49 టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.13 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు ద్వారా వచ్చిన 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు..

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు కొన సాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 4,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,083 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పీఏసీఎస్ సభ్యులు విధిగా కేవైసీ చేయించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 128 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) సభ్యులంతా తప్పనిసరిగా కేవైసీ వివరాలను డిజిటలైజేషన్ చేయించుకోవాలని బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల కేవైసీ వివరాలను ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని ఆయా సంఘాల్లో సంప్రదించాలని సూచించారు.

అత్త వేధింపులు భరించ లేక
కోడలు ఆత్మహత్య


సృజన (ఫైల్)

కోరుట్ల, ఆగస్టు 12 : కోరుట్ల పట్టణంలో అత్త వేధింపులు భరించలేక కోడలు సోమవారం ఆత్మ హత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గంగ పేట ప్రాతంలో నివాసం ఉంటున్న పులివేని నరేష్‌తో ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామానికి చెందిన సృజన (28) ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. నరేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. సృజన గంగంపేట ప్రాంతంలో ఆమె పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో సృజన అత్త ఎకశిల నిరంతరం వేధింపులకు పాల్పడేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అత్త ఎకశిల కోడలితో గొడవ పడింది. దీంతో సృజన విషయాన్ని భర్తకు ఫోన్ ద్వారా వివరించింది. తాను పిల్లలను విడిచి వెలుతున్నానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టివేసి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో నుంచి సృజన బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు గమనించి ఆత్మహత్య పాల్పడ్డట్లు గుర్తిం చారు. విషయాన్ని సృజన బంధువులకు, పోలీసులకు సమా చారం అందిం చారు. విషయం తెలసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సృజన తల్లి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సృజనకు విధన్ (5), వియాన్ (3) కుమారులు, లింకారి (8నెలల) కూతురు ఉంది. తల్లి మృతదేహం వద్ద పిల్లలు అమ్మ లే అమ్మా అంటూ ఏడుస్తూ లేపే ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. సృజన భర్త నరేష్ గల్ఫ్ నుంచి మంగళవారం చేరుకుంటాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రాజన్న క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

● శ్రావణం సందర్భంగా పెరిగిన రద్దీ ● సాయంత్రం ఘనంగా మహాలింగార్చన



ఆలయ ఆవరణలో, క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 12 : వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రావణ మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం రోజున భక్తులు వేములవాడకు తరలివచ్చి శ్రీస్వామి వారి వసతిగదుల్లో విడిది చేశారు. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. బ్రేక్ దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని ముందుగా శ్రీవిఘ్నేశ్వరుడిని దర్శించుకుని శ్రీపార్వతిపరమేశ్వరుల సేవలో తరించారు. సోమవారం రాజన్న దర్శనానికి 35 వేల మంది వరకు భక్తులు వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామి వారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

క్యూలైన్‌లను పరిశీలించిన ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం కోడెమొక్కు, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏఈవో రమేష్ బాబుకు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు రాజన్‌బాబులను ఆదేశించారు.



కల్యాణ మంటపంలో లింగార్చనలో పాల్గొన్న భక్తులు, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను పరిశీలిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో రమేష్‌బాబు, పీఆర్వో రాజన్ బాబు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు


రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రానికి ఉదయం వరకు తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకు లు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ లు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహ నంపై పుర వీధుల్లో ఊరేగించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శ నం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కోటిలింగాలలో...


గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు

వెల్గటూర్, ఆగస్టు 12: శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని కోటిలింగాలలో భక్తుల సందడి నెలకొన్నది. శ్రీ కోటేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారు మ్రోగింది. కోటిలింగాల గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించి గోదావరి ఒడ్డున గల గంగా మాత విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జంట నాగులకు ప్రత్యేక పూజలు చేసి, పాలతో అభిషేకం చేశారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం కిట కిటలాడింది. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

నెమలి వంట.. యూట్యూబర్ రిమాండ్

తంగళ్లపల్లి, ఆగస్టు 12: నెమలి మాంసం ఎలా వండాలో చూపించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్ చేసిన యూట్యూబర్ తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో కల్పనదేవి తెలిపారు. జాతీయ పక్షి నెమలిని ఎలా కూర వండాలో సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు ప్రణయ్‌కుమార్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. యూట్యూబర్ ప్రణయ్‌కుమార్‌ను విచారించి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

రుద్రంగి, ఆగస్టు 12: అజర్ బైజాన్ దేశం పంపిస్తానని ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు రుద్రంగి ఎస్ఐ అశోక్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన కొలకాని రవి అనే వ్యక్తిని అజర్ బైజాన్ అనే దేశం పంపిస్తానని రూపాయలు 2,75,000 తీసుకొని వీసా ఇవ్వకపోవడంతో పాటు, డబ్బులు తిరిగి ఇవ్వకుండా నమ్మించి మోసం చేశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిర కిషన్‌పై ఇప్పటికే రుద్రంగి పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు కాగా వివిధ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసులు నమోదు కావడంతో ఇప్పటికే అజ్మీరా కిషన్ జైల్లో ఉన్నట్లు తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి

● జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి ● ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 12: జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో కరీంనగర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌సింగ్‌లు ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహి స్తున్న ఈ పోటీల్లో విజేతలకుగా నిలిచిన వారికి రూపాయలు 25 వేల నగదు బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. టేబుల్ టెన్నిస్ క్రీడతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతుందని అన్నారు.

రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల నుంచి 200 మంది క్రీడా కారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-12, 15 పురుషులు, మహిళ ల విభాగాల్లో సింగిల్స్ డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్ పోటీలను నిర్వ హించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కోశాధికారి దారం గౌతమ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మద్దెల వికాస్ కుమార్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

● పోటీల విజేతలు :

పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేష్ (కొత్తగూడెం), సంతోష్ (కరీంనగర్), పి.అజయ్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. డబుల్స్ విభాగంలో లోకేష్, చైతన్య (కొత్తగూడెం), శైలేందర్, కిరణ్ (మంచిర్యాల) మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వినయ్‌సాగర్, శ్వేత (నిజామాబాద్) ప్రథమ స్థానం, పి.అజయ్, అవనిరెడ్డి (కరీంనగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్-15 బాలుర విభాగంలో జ్వలిత్ (ఖమ్మం), పి.అజయ్ (కరీంనగర్), సార్విక్ (ఖమ్మం) మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సత్య (మంచిర్యాల), వై.అవనీరెడ్డి (కరీంనగర్), అక్షర (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-12 బాలుర విభాగంలో హితేష్ (ఖమ్మం), ఫజల్ (ఖమ్మం), వి.శ్రేయాస్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సింధూ (నిజామాబాద్), రవళిక (నిజామాబాద్), అనన్య (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

దేవాదాయశాఖ ఏసీగా సుప్రియకు అదనపు బాధ్యతలు

నేడు బాధ్యతల స్వీకరణ



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12: ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియకు ఉమ్మడి జిల్లా సహాయ కమీషనర్(ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఆ శాఖ రాష్ట్ర కమీషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. మొన్నటి వరకు ఆమె నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఏసీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీలో అక్కడికి కొత్త ఏసీ రావడంతో తిరిగి కరీంనగర్ సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏసీగా కూడా వ్యవహరించనున్నారు. గతంలో ఇక్కడ ఏసీగా పనిచేసిన ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. సుప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

బంగారం షాపులో చోరీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12: పట్టణంలోని మిషన్ హైస్కూల్ ఏరియాలోగల ఓ బంగారం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి షెట్టర్ తాళాలు పగుల గొట్టి లోనికి చొరబడి 2 తులాల బంగారం, అర కిలో వెండి అపహరించుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రెండు దుకాణాల్లో..

శంకరపట్నం: మండలంలోని సైదాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గల చికెన్ సెంటర్, హోటల్ తాళాలు పగులగొట్టి వాటిలో ఉన్న 15 వేల రూపాయలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. చికెన్ సెంటర్‌లో ఐదు వేలు, హోటల్‌లో 10 వేల రూపాయల దొంగతనం జరిగిందన్నారు. బాధితులు జునసూర్ తిరుపతి, చిర్ర సం తోష్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సాగర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తన బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు ఊడదీసి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 50 వేలు ఎత్తుకెళ్లారు. తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన పొరుగువారు సాగర్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా బీరువాలోని నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని మెట్‌పల్లి గ్రామం లో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీణ వంక మండలం జంగంపల్లి నుంచి మెట్‌పల్లి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. జంగంపల్లికి చెందిన డ్రైవర్ రేగుల తిరుపతి సరైన పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఘనంగా కుంకుమ పూజలు


కుంకుమ్మ పూజలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, ఆగస్టు 12 : పట్టణంలోని జవహర్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస రెండవ సోమవారం పురస్కరించుకొని కుంకుమ పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను జరిగాయి. గణపతి, పుణ్యహవచనం పూజలను నిర్వహించిన సామూహిక శివ ముష్టి వత్రాలను నిర్వహించారు. అనంతరం మహిళలచే కుంకుమ పూజ నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్, చిద్రాల వినోద్, తాటికొండ ఆంజనేయులు, కంఠాల బాస్కర్, బట్టు హరికృష్ణ, జిల్లా శ్రీనివాస్‌లతో పాటు మహిళలు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

పెగడపల్లి, ఆగస్టు 12: ఎరువులు, పురుగు మందుల దుకాణంలో పని చేస్తూ మోసానికి పాల్పడిన మారిశెట్టి మధు అనే వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్.ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం బతికె పల్లి గ్రామానికి చెందిన మారిశెట్టి మధు అదే గ్రామానికి చెందిన క్యాస కృష్ణ అనే వ్యక్తికి చెందిన సుద్దపల్లి గ్రామంలోని ఫర్టి లైజర్ షాపులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. షాపులో ఖాతాదారుల వద్ద నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసుకుని వాడుకోవడంతో పాటు వాటిని కప్పి పుచ్చుకునేందుకుగాను షాపునకు చెందిన రూ. 20 లక్షల ఉద్దెర ఖాతా బుక్కులను కాల్చి వేశాడు. దుకాణ యజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ అనంతరం కేసు నమోదు చేసి మధును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

కొండ చిలువ సంచారం



సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 : రాజన్న సిరిసిల్ల కేంద్రం లోని విద్యానగర్ శివారు ప్రాంతం వైకుంఠ ధామం ప్రాంతంలో దాదాపు ఆరు అడుగుల పొడవు ఉన్న కొండ చిలువ సంచరిస్తోంది. ఓ వ్యక్తికి కొండ చిలువ కనపడడంతో వీడియో తీసి సోమవారం సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అవుతుంది. ఈ దృశ్యాలను చూసిన పట్టణ ప్రజలు అటు వైపు వెళ్లడానికి సాహసించడం లేదు. కొండచిలువ సంచారంతో ఆదే ప్రాంతంలో ఉన్న బీసీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయపడుతున్నారు. వైకుంఠధామంకు మరో వైపు నెహ్రూపార్క్, స్విమ్మింగ్ పూల్ జనంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అటు వైపు కొండ చిలువ వస్తే ఎలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

శంకరపట్నం, ఆగస్టు 12: ఐదు నెలల క్రితం ఓ మహిళ పోగొట్టుకున్న మొబైల్‌ను కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తిరిగి సోమవారం అప్పగించారు. ఎస్ఐ రవి శంకర పట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన ఎండీ సఫియా ఐదు నెలల క్రితం స్మార్ట్ ఫోన్ పోయిందని సీఈ ఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవి దర్యాప్తులో మొబైల్‌ని కనుక్కుని తిరిగి ఫిర్యాదుదారురాలికి అప్పగించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్యాల, ఆగస్టు 12: కొండగట్టులోని ఓ గదిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందులో కొడిమ్యాలకు చెందిన ఇద్దరు, కోరుట్లకు చెందిన ఇద్దరు, మేడిపల్లి, జగిత్యాల, కొండగట్టుకు చెందిన ఒక్కరు ఉన్నా రని వారి వద్ద రూ.44,060 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఏసీపీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మడత రమేష్



ధర్మారంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కోల్‌సిటీ, ఆగస్టు 12: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం సింగరేణి ఇన్స్‌ట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, విద్యార్థులు బాధ్యతతో వ్యవహరిస్తూ చదువుపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ రవుఫ్‌ఖాన్, మిట్టపల్లి లిటిల్, లావణ్య, మౌనిక, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలుగా మారి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్‌లను ప్రోత్సహించవద్దన్నారు. మత్తుపదార్థాలను వినియోగించినా, విక్రయించినా తమ దృష్టికి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జైకిషన్ ఓజ, వన్‌టౌన్‌సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ ఎల్ భూమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 12 : యువత, విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపూర్ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌పై బసంత్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం డ్రగ్స్ నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్ఐ ఆర్.స్వామి మాట్లాడుతూ సమాజంలో యువత పాత్ర చాలా గొప్పదన్నారు. కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కి పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల, ఆగస్టు 12 : అందరం కలిసి డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా నివారిద్దామని పొత్కపల్లి ఎస్ఐ సుధాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్లో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మోడల్ హైస్కూల్లో ఏఎస్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. అలాగే పోలీస్ స్టేషన్లో నిర్వహించిన రౌండ్ ఆఫ్ సమావేశంలో ఏఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరస్తుల బారిన పడి ఆర్థిక నష్టాలకు గురికావద్దని విద్యార్థులను కోరారు.

రామగిరి, ఆగస్టు 12: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులు, సిబ్బంది సామూహిక నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, పీజీకర్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, కన్నూరి ఓదేలు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, ఆగస్టు 12: జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలని రామగుండం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నాసాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జిల్లాలో మాదకద్రవ్యాలను లేకుండా చేయడానికి సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్‌రావుతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 12: డ్రగ్స్‌ను దూరం చేద్దాం ఆరోగ్యాలు కాపాడుకుందామని ప్రభుత్వ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం డ్రగ్స్ నివారణ కోసం మెడికల్ సిబ్బందితో కలిసి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రధర్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజ, వైద్య సిబ్బంది ప్రకాశ్, శ్రీనివాస్, నర్సింగ్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు, ఆగస్టు 12 : ఎలిగేడులో అంతర్జాతీయ దినోత్సవంను పురస్కరించుకొని అంబేడ్కర్‌చౌక్‌లో సోమవారం పాఠశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్, ఎంపీడీఓ గ్రామ పురవీధుల గుండా డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల చేత డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు బానిసై యువత మాదక ద్రవ్యాలవైపు వెళ్లకుండా ఉండేలా తల్లిదండ్రులు కృషిచేయాలని కోరుతూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరిలోను అదేవిధంగా యువత డ్రగ్స్ మాధక ద్రవ్యాలతో తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ భాస్కర్‌రావు, హైస్కూల్ హెచ్ఎం దేవేందర్‌రావు, కార్యదర్శి అంజలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాఘవపూర్‌లో ర్యాలీ..

ధర్మారం, ఆగస్టు 12: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ధర్మారం మండల కేంద్రంలో గల పలు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయనచెప్పారు. ప్రాథమిక స్థాయిలో మంచి విద్యను అభ్యసించడం ద్వారా తల్లిదండ్రులతో పాటు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుతారిని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ తన్నీర్ రాజేందర్, జిల్లా కో ఆర్డినేటర్ ఎల్లారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం..

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12: రామగుండం నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్‌సీపీ పోరాటాలు చేసేందుకు కార్యచరణను రూపొందిస్తుందని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గోలివాడ ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని ఎన్‌సీపీ పార్టీ కార్యాలయంలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మహిళా నాయకురాలు పొన్నం రజితయాదవ్ ఆధ్వర్యంలో 39వ డివిజన్‌కు చెందిన మహిళలు చేరగా వారికి ప్రసన్నకుమార్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్‌లోని సమస్యల పరిష్కారం కోసం ఎన్‌సీపీ పనిచేస్తుందని, రాష్ట్ర నాయకత్వంతో పార్టీని ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి అధికార పక్షాన్ని నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరి నాగరాజు, అర్క్యాటి పద్మ, మేకల రాజేశ్వరి, పోచమ్మ, లక్ష్మీ, రజిత, ఇర్ఫానాలతో పాటు 40 మంది మహిళలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12: రామగుండం కార్పొరేషన్‌లోని 11వ డివిజన్ సంజయ్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సోమవారం ఆ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వినిప్రకాష్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12: గోదావరిఖని మార్కండేయ కాలనీలో సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. దేశానికి స్వాతంత్ర్య రాక ముందే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో బబ్బుద్దీన్‌బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్‌ల నాయత్వంలో 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిందని పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, ఆజాద్‌ల ఎంతో మంది వీరుల ఆశయాల సాధన కోసం ఏఐఎస్ఎఫ్ పనిచేస్తూ విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసాల నవీన్, గొడిసెల ప్రణీత్, గాజుల వినయ్, మామిడి రాహుల్, అలేఖ్య, ప్రవీణ, శిరీష పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థిని మృతి

జ్యోతినగర్, ఆగస్టు 12 : ఎన్టీపీసీకి చెందిన మల్లెపల్లి సాహితి(15) అనే పదో తరగతి విద్యార్థిని గుండెపోటుతో మృతిచెందింది. ఆదివారం రాత్రి సాహితికి గుండెపోటు రాగా ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. సాహితి తండ్రి ఎన్టీపీసీలో మజ్దూర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, ఎన్టీపీసీ ఆసుత్రిలో ప్రాథమికంగా సరైన వైద్యం అందకపోవడంతోనే సాహితి చనిపోయిందని గుర్తింపు కార్మిక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

రైల్వే స్టేషన్ల గేట్ల నుంచి రాకపోకల నిలిపివేత

ఓదెల, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని 31వ రైల్వే గేట్ మీదుగా 13 నుంచి 15 వరకు వాహన రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పెద్దపల్లి రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. ఓదెలతో పాటు కొలనూర్, పొత్కపల్లి రైల్వేలైన్‌ల అత్యవసర మరమ్మతులను చేపడుతున్నట్లు తెలిపారు. గేట్లలో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆర్టీసీ అధికారులు వివిధ గ్రామాల వాహన దారులు, ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



ఆర్‌ఓహెచ్ షెడ్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అంతర్గాం, ఆగస్టు 12: రైల్వే సంస్థలో నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) రామగుండం బ్రాంచ్ సెక్రెటరీ రామాచారి అన్నారు. సోమవారం రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా ఆర్‌ఓహెచ్ షెడ్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 18నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని రైల్వే యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 8వ వేతన సవరణ చేపట్టాలని పేర్కొన్నారు. రైల్వే సంస్థలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికీ 25శాతం ఇంటి అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు ఓవై స్వామి, ఆనంద్, వీరన్న, మోజెస్, రవీందర్‌రెడ్డి, గణేష్‌సింగ్ పాల్గొన్నారు.

గురుకుల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

-కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12: గురుకుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టర్ రంగంపల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకులం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రంగంపల్లిలోని బీసీ గురుకుల పాఠశాల పూర్తి స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ పరిసరాలను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులకు రుచికరంగా వంటలు చేయించాలని అధికారులకు సూచించారు. వానాకాలం దోమల సమస్య రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కన్వీనర్, గురుకుల ప్రిన్సిపాల్ మని దీప్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేత్ర దానం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12: గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన అరిగెల శకుంతల(61) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ కార్యదర్శి కేఎస్ వాసు ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషయన్ సతీష్ కుమార్ శకుంతల కళ్లను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన భర్త రామకృష్ణ, కుమారులు ప్రేమ్‌సాగర్, విద్యాసాగర్, ఉదయ్ సాగర్‌లను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, ఆగస్టు 12: ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 11న హైదరాబాద్ లో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలలో ఈ స్కూల్‌కు చెందిన జి రిషి వర్ధన్, జి. హర్షవర్ధన్‌లు కుంగ్ ఫూ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారని స్కూల్ డైరక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ లు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన రిషివర్ధన్, హర్షవర్ధన్‌లను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మార్షల్ ఆర్ట్స్ వలన మంచి క్రమ శిక్షణతో పాటు స్వీయ రక్షణ కు దోహదపడుతుందన్నారు.

బీసీ సంక్షేమసంఘం మండల అధ్యక్షుడిగా రాజయ్య

సుల్తానాబాద్, ఆగస్టు 12: బీసీ సంక్షేమ సంఘం సుల్తానాబాద్ మండల అధ్యక్షుడిగా మండలంలోని బొంతకుంటపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆసరి రాజయ్యను నియమించినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్న రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి బక్కయ్యను బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించామని రమేష్ ఒక ప్రకటనతో పేర్కొన్నారు. ఈ మేరకు వీరిద్దరికి నియామకపత్రాలు అందజేశామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, ఆగస్టు12: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుల్తానాబాద్ పట్టణానికి చెందిన మీరాహుస్సేన్‌కు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ఐదు వేల రూపాయల నగదు అందజేశారు. ఐదో వార్డుకు చెందిన మీరాహుస్సేన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలో ఉన్న బాధితుడిని సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

అంధకారంలో ఖని చౌరస్తా..

- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12: రెండు రోజులుగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా అంధకారంలో ఉంది. నిత్యం జనాలతో రద్దీగా ఉండే చౌరస్తా ప్రాంతంలో హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు చీకట్లో ఇబ్బందులకు గురవుతున్నారు. చౌరస్తాలో రోడ్లపైనే పశువులు సంచరిస్తుండడంతో హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో పశువులను ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. నెలరోజులుగా తరచూ హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. దీనిపై కార్పొరేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. 15రోజుల క్రితం కూడా లైట్లు వెలగకపోవడంతో స్థానికుల ఫిర్యాదుతో స్పందించి మరమ్మతులు చేసిన వారం రోజులకే మళ్లీ లైట్లు వెలగడం లేదు. కార్పొరేషన్ సిబ్బంది లైట్ల మరమ్మతుల విషయంలో పట్టించుకోవడం లేదు. చౌరస్తా నుంచి ఫైవింక్లయిన్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు కూడా వెలగడం లేదు.

యువకుడి ఆత్మహత్య

రామగిరి, ఆగస్టు 12: మండలంలోని కల్వచర్లకు చెందిన కూర సదానందం(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకోగా స్థానికులు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు.



శివపల్లిలో జ్వరంతో బాధపడుతున్న ప్రజలు

విష జ్వరాల బారిన శివపల్లి ప్రజలు..

ఎలిగేడు, ఆగస్టు 12 : మండలంలోని శివపల్లిలో విషజ్వరాల బారిన పడిన ప్రజలు తల్లడిల్లుతున్నారు. 15రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెత్తచెదారంలో రోడ్లు, మురికి కాలువలు నిండిపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాతావరణం ఏర్పడిన మార్పులతోపాటు రోడ్లపై ఏర్పడిన మురికి గుంతలు, దోమలకు నిలయంగా మారాయి. గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో పాటు తాగునీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు లేవు. దీనివల్ల ఒకవైపు తాగునీటి కాలుష్యం, మరోవైపు దోమల బెడదవల్ల ప్రజలు రోగాలబారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివపల్లిలో గతవారం రోజులుగా విషజ్వరాలతో ప్రతి ఇంటా బాధపడుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని వారు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతి ఒక్క ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలి

- బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపైన జాతీయ జెండాని ఆవిష్కరించాలని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రధానచౌరస్తా, కార్పొరేషన్ టీజంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలను శుభ్రం చేసి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీల యాజమాన్యాలు కార్మికులకు జాతీయ జెండాలను అందించి వారిలో జాతీయభావం పెంపొందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మెరుగు హన్మంత్‌గౌడ్, గాండ్ల ధర్మపురి, కాసిపేట శివాజీ, కోడూరు రమేష్, భూమయ్య, సతీష్, గోపగాని నవీన్, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, బూడిద రమేష్, అందె రాజ్‌కుమార్, పంగ రవి, తోట కుమారస్వామి నారాయణ, రఘు, మల్లేష్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న సంధ్యారాణి

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11: యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి పట్టణ కేంద్రంలో పెద్దఎత్తున తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రుపట్ల సునీల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది మహనీయులు ప్రాణాలర్పించారన్నారు. వారిని స్మరించుకుంటూ భారతీయ జనతా పార్టీ అనేక కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో తంగేడ రాజేశ్వరరావు పోల్సాని సంపత్, ఒజ్జ తిరుపతి, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, కారంగుల శ్రీనివాస్, రాజన్న పటేల్, రాజమాత కృష్ణ, రాకేష్ కుక్క వంశీ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మంథనిరూరల్, ఆగస్టు 12: మండలం అరెంద గ్రామంలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వృద్ధాప్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులకు, ప్రజలకు, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, అధిక రక్తపోటు, కీళ్ల నొప్పులు, మూత్రపిండాలు, మలబద్ధకం, దగ్గు-దమ్ము, నరాలు మొదలగు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ జి.శ్రీవాణి, డిపిఎం విద్యాసాగర్, డాక్టర్ జోష్న, సిబ్బంది మేఘమాల, శ్రీనివాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చేప పిల్లలు పంపిణీ చేయాలి

మంథని, ఆగస్టు 12: మత్స్యకారులకు ప్రతి సంవత్సరం జూన్ నెలలో అందించవలసిన ఉచిత చేప పిల్లలు ఆగస్టు రెండో వారం వచ్చినప్పటికీ ఇంకా అందుబాటులోకి రాలేదని జిల్లా మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతికుమార్ సోమవారం ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు చేప పిల్లలు అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా అందించే క్రమంలో నాసిరకం చేప పిల్లలను అందించారన్నారు. ఈసంవత్సరం టెండర్ నోటిఫికేషన్ వచ్చినప్పటికీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయం గురించి పునరాలోచన చేసి త్వరితగతిన మత్స్యకారుల గురించి సరైన నిర్ణయం తీసుకొని స్పందించాలని కోరారు.



కేఎల్ మహేంద్రకు ఘన నివాళి



మహేంద్రకు నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి, ఆగస్టు 12: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ సెంటినరీకాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం కేఎల్ మహేంద్ర వర్ధంతిని యూనియన్ నాయకులు జరుపుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, డిటి రావు, వెంకటస్వామి, శ్రీనివాస్, పోశం, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు ఐఎన్టీయూసీ అండ

మందమర్రి టౌన్, ఆగస్టు 12: సింగరేణిలో కార్మికుల హక్కులసాధనకు రక్షణగా ఉన్నది ఐఎన్టీయూసీనేనని ఆ యూనియన్ సెంట్రల్‌కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. సోమవారం కేకే5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. కార్యక్రమంలో దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, సదయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌జీ-1 జీఎం

గోదావరిఖని, ఆగస్టు 12: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సోమవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌జీ-1 ఏరియాలో భూ సేకరణ, నూతన గనుల అనుమతి, భూ నిర్వాసితుల సమస్యలపై వారు చర్చించారు. భూ సేకరణ అనుమతులను త్వరగా ఇవ్వాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఆయన వెంట సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్టేట్ మేనేజర్ సాంబశివరావు ఉన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న జీఎం

ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 12: రామగుండం రీజియన్ పరిధిలోని ఈపీ ఆపరేటర్లకు డీ గ్రేడ్ నుంచి సీ గ్రేడ్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని ఆపరేటర్లు డీ శ్రీనివాస్, రమేష్, సత్యనారాయణ, మల్లేష్, క్రాంతి కుమార్, శ్రీహరి రాజశేఖర్‌రెడ్డిలు ప్రకటనలో పేర్కొన్నారు. గత 5ఏళ్లుగా రామగుండం రీజియన్ పరిధిలో డీ గ్రేడ్‌లో కొనసాగుతున్నట్టు తెలిపారు. తమతో రిక్రూట్ అయి ఇతర ఇతర ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న తోటి ఆపరేటర్లు సీ మరియు బీ గ్రేడ్‌లో ఉన్నారని తెలిపారు. ఆర్జీ రీజియన్ పరిధిలో పనిచేస్తున్న తమకు మాత్రం సీ గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వలేదని తెలిపారు. 01.09.2021 నుండి సీ గ్రేడ్ ఆపరేటర్లుగా ప్రమోషన్లు రావాల్సి ఉన్నదని, 01.09.2024 నుండి బీ గ్రేడ్ ప్రమోషన్లు రావాల్సి ఉన్నదని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమోషన్లు ఇవ్వని కారణంగా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు బదిలీలు, క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో అన్యాయానికి గురవుతున్నట్లు ఈపీ ఆపరేటర్లు ప్రకటనలో తెలిపారు. సింగరేణి చరిత్రలో ప్రమోషన్లు లేకుండా 5 ఏళ్లు ఒకే గ్రేడ్‌లో ఉన్నట్టు వారు ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ప్రమోషన్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, ఆగస్టు 12: ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని క్యాంటీన్‌లో నూతన టేబుల్స్, కుర్చీలతో ఆధునికీకరణ పనులు చేపట్టి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలు చేయాలేని విధంగా సింగరేణి ఉద్యోగులకు సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేను

సద్వినియోగం చేసుకోవాలి..

- ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి, ఆగస్టు 12 : సింగరేణి డివిజన్‌లలో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్ రావు, వెంకటేశ్వర్లు ఉమ్మడి ప్రకటనలో సోమవారం తెలిపారు. మంగళవారం అడ్రియాల ఏరియాలో పనిచేసే ఉద్యోగులు మధ్యాహ్నం 3గంటలకు ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్(పా) చిరునామాతో గ్రీవెన్స్ పిటీషన్ అందజేయాల్సిందిగా సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాల్సిందిగా పేర్కొన్నారు.